క్లుప్తంగా

నేడు శిక్షణ

పెద్దతిప్పసముద్రం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి తెలిపారు. 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారు చేసే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కలికిరి : మండలంలోని గుట్టపాళెం గ్రామంలో గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరుగుతుందని ఎంపీడీఓ గంగయ్య తెలిపారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జిల్లా నోడల్ అధికారి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు.

పేద కుటుంబానికి చేయూత

పెద్దతిప్పసముద్రం: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐరాలకు చెందిన వెంకట్రమణ, లక్ష్మీదేవి దంపతుల కూతురు రిత్విక అనారోగ్యంతో వారం రోజుల క్రితం మృతి చెందింది. కూలీనాలీ చేసుకునే పేద దంపతులు పాప మృతితో తల్లడిల్లిపోయారు. విషయం తెలుసుకున్న మండలంలోని యంగ్ ఇండియా సేవా సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, తగాది శ్రీనివాసులు ఫౌండేషన్ ద్వారా బుధవారం ఈ నిరుపేద దంపతులకు ఓదార్పడంతో పాటు రూ.15 వేల నగదును అందజేసి మానవత్వం చాటుకున్నారు.

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన

కలికిరి : మండలంలోని సర్పంచ్‌లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం ఏర్పాటు చేసిన సమవేశంలో ఎంపీడీఓ గంగయ్య మాట్లాడుతూ ఆయా శాఖల ఆధ్వర్యంలో అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో గ్రామ పంచాయతీ నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీకి కూరగాయలు


టీటీడీకి పంపుతున్న కూరగాయలు

మదనపల్లె సిటీ : స్థానిక కేజే కూరగాయల మండీ అధినేత దాదాపీర్ బుధవారం టీటీడీకి పది టన్నుల కూరగాయలు పంపారు. గత ఏడు సంవత్సరాల నుంచి టీటీడీ అన్నదాన కార్యక్రమానికి కూరగాయలు పంపుతున్నారు.ఆయన చేస్తున్న సేవలను స్థానిక వెలుగు ప్రత్యేక పాఠశాల నిర్వాహకులు ఉదయకుమార్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో మెట్రో బాబ్‌జాన్, మోటివేటర్ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యాత్రకు ఘన స్వాగతం


యాత్రకు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, తదితరులు

కలకడ : వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ద్వారా గ్రామాల్లోని యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కలుగుతుందని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ రమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాగత, అవగాహన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, ఉపాధి అవకాశాలు, విజ్ఞాన కేంద్రాలు వంటి వాటి గురించి తెలియజేశారు. అన్నిశాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నందలూరు(రాజంపేట) : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని శ్రీ కోదండరామాలయానికి తిరుపతికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త చేజర్ల ఇంద్రకుమార్ రాజు రూ.2లక్షల విరాళాన్ని ప్రకటించారు. బుధవారం నిర్మాణంలో ఉన్న ఆలయాన్ని సందర్శించిన ఆయన్ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. నందలూరులో ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన్ను ఎన్ఆర్ఐ ఆకుల చలపతి ఆలయానికి ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఇంద్రకుమార్ రాజు తనవంతుగా రూ. 2 లక్షలు రెండు, మూడు రోజులలో అందిస్తానని హామీ ఇచ్చారు.

ఆర్థిక సహాయం

గాలివీడు : చదువుల రాణిస్తున్న విద్యార్థిని పద్మప్రియకు గాలివీడు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు ఆర్య శంకర్ ఆర్థికసహాయం అందించారు. గత 10వ తరగతి ఫలితాల్లో బాలిక ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించి ఐఐఐటీలో సీటు సాధించింది. రూ.5వేలు నగదును కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు వేమనాయుడు, కరుణాకర్‌రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దుచేయాలి

- నూతన చట్టంతో డ్రైవర్ వృత్తిలోకి కొత్తవారు రాలేరన్న డ్రైవర్లు
- అనంతపురం–కృష్ణగిరి జాతీయరహదారిపై డ్రైవర్ల ఆందోళన


బసినికొండ వై జంక్షన్ శ్రీ కృష్ణదేవరాయ సర్కిల్‌లో జాతీయరహదారిపై నిరసన తెలుపుతున్న లారీ డ్రైవర్లు

మదనపల్లె : డ్రైవర్లకు ఇబ్బందికరంగా మారిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ది మదనపల్లె లారీ, ఐషర్ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి డిమాండ్ చేశారు. బుధవారం బసినికొండ వై జంక్షన్ శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ వద్ద అనంతపురం–కృష్ణగిరి జాతీయరహదారిపై పట్టణంలోని లారీ డ్రైవర్లతో కలిసి నిరసన తెలిపారు. రాస్తారోకో నిర్వహించారు. డ్రైవర్లను ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పెట్టేందుకు కేంద్రం కొత్త చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం వల్ల రోడ్డు ప్రమాదం జరిగితే.. పదేళ్ల జైలుశిక్షతో పాటు, రూ.10లక్షల వరకు జరిమానా విధించేలా కేంద్రం తెచ్చిన చట్టంపై లారీ డ్రైవర్లు ఆగ్రహంగా ఉన్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం పార్లమెంటులో చర్చించకుండానే ఈ చట్టానికి ఆమోదముద్ర వేయడం బాధాకరమన్నారు. రోడ్డుప్రమాదాలకు డ్రైవర్లనే బాధ్యులను చేయడం సరికాదని, తక్షణమే ఈ చట్టాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. 90 శాతం ప్రమాదాలు మానవేతర కారణాల వల్లే జరుగుతున్నట్లు అనేక అధ్యయనాల్లో తేలిందన్నారు. కానీ కేంద్రం ప్రతిపక్షాలను పార్లమెంట్ నుంచి బయటకు గెంటేసి ఈ బిల్లును పాస్ చేయించిందని ఆరోపించారు. జయహో రథసారథి డ్రైవర్స్, క్లీనర్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా ది మదనపల్లె లారీ, ఐషర్ డ్రైవర్స్, క్లీనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికే రవాణారంగం 30 శాతం డ్రైవర్ల కొరత ఎదుర్కొంటోందని, నూతన చట్టం వల్ల కొత్తవారు డ్రైవర్ వృత్తిని చేపట్టేందుకు ముందుకు రారన్నారు. హిట్ అండ్ రన్ కేసులో విధించే శిక్షకు సంబంధించి కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా డ్రైవర్ల సంఘాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని చట్టంలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ సెక్రటరీ మగ్బూల్, ఖాదం, వైస్ ప్రెసిడెంట్ చంద్ర, బాబు, అక్బర్, రియాజ్, ఆదం, షబ్బీర్, ఖాళీఅహ్మద్, షరీఫ్, ఐషర్ డ్రైవర్స్ అసోసియేషన్ మల్లి, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు అప్రమత్తత అవసరం


మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ: డ్రైవర్లు అప్రమత్తంగా ఉండి వాహనాలు నడపాలని స్థానిక ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక డిపో కార్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు లేని డిపోగా తీసుకురావాలన్నారు. డ్రైవర్లు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. మద్యం తాగి విధులకు హాజరు కారాదని సూచించారు. సిగ్నల్స్ అనుసరించి విధులు నిర్వర్తించాలన్నారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం, సుఖమయం, శుభప్రదమని ప్రయాణికులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పీలేరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం పీలేరు పట్టణంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం 8.30 గంటల నుంచి పట్టణంలోని యల్లమంద క్రాస్, కావలిపల్లి, మారుతి నగర్, సైనిక్ నగర్ ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని తెలిపారు.

డాక్టర్లపై దౌర్జన్యం సరికాదు

పీలేరు : డాక్టర్లపై దౌర్జన్యం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పీలేరు బ్రాంచ్ అధ్యక్షుడు, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 16న స్థానిక ప్రభుత్వాస్పత్రికి పులిచెర్ల మండలం ఆవులపెద్దిరెడ్డిగారిపల్లె నుంచి పాయిజన్ తీసుకున్న వ్యక్తితోపాటు వచ్చిన వారి బంధువులు చికిత్స విషయంపై గొడవపడి డాక్టర్లపై దుర్భాషలాడడంతోపాటు దాడికి ప్రయత్నించారని తెలిపారు. కొన్ని వైద్య పరికరాలను ధ్వంసం చేసి ఆస్పత్రిలో భయానక వాతావరణం సృష్టించారన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని.. భవిష్యత్తులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

కులగణన సక్రమంగా నిర్వహించాలి


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

తంబళ్లపల్లె : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో కులగణన సక్రమంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కార్యాలయం ఏఓ ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని గ్రామ సచివాలయ ఉద్యోగులకు కులగణనపై శిక్షణ ఇచ్చారు. ఈ నెల19 నుంచి 28వ తేదీ వరకు సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి కులగణన ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. యాప్ వినియోగం అందులో పూర్తి వివరాలను సమగ్రంగా పొందుపరిచే విధానంపై శిక్షణ ఇచ్చారు.

బాధ్యతల స్వీకరణ


డాక్టర్ జమున

మదనపల్లె: మదనపల్లె మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జమున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె నెల్లూరు మెడికల్ కాలేజ్‌లో అనస్థీషియా ప్రొఫెసర్‌గా పనిచేస్తూ పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది సహకారంతో కళాశాల అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. కాగా, ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ మురళీధర్ మదనపల్లె మెడికల్ కాలేజ్‌లో ప్రొఫెసర్‌గా కొనసాగుతారు.

మార్కెట్‌కమిటీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ


మార్కెట్‌కమిటీ నూతన చైర్మన్, వైస్‌చైర్మన్‌లను సన్మానిస్తున్న సెక్రటరీ అభిలాష్

మదనపల్లె : మదనపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తట్టి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్‌గా బోర్‌వెల్ వెంకటేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ అభిలాష్ సమక్షంలో వారు బాధ్యతలు స్వీకరిస్తూ సంతకాలు చేశారు. ఈ సందర్భంగా మార్కెట్‌కమిటీ సెక్రటరీ అభిలాష్, సిబ్బంది, పట్టణ ప్రముఖులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్మన్, వైస్‌చైర్మన్‌లను అభినందించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ తట్టికారదమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలోని వివిధ కేటగిరీలలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కడప రీజినల్ సెక్రటరీ రఘునాథరెడ్డి కోరారు. బుధవారం ఆర్ఎం కార్యాలయం వద్ద వైఎస్సార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు కనీసం రూ. 5 వేల జీవనభృతిని మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు.

వెలిగల్లు పార్కు అభివృద్ధి పట్టదా?


వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టులోని పార్కును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గాలివీడు : మండలంలోని వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు సమీపంలోని పార్కును ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సీపీఐ నాయకులతో కలిసి పార్కు పరిసరాలను పరిశీలించారు. మాట్లాడుతూ నిత్యం పార్కుకు వచ్చే సందర్శకులకు పార్కులో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ పార్కులో మరుగునీటితో ఈత కొలను, ఆట వస్తువులు శిథిలావస్థకు, విరిగిన బల్లలకు మరమ్మతులు చేయకపోవడం బాధాకరమన్నారు. కనీసం పార్కులో చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రతను పాటించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కులో పరిశుభ్రతతోపాటు మంచి వాతావరణం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు బీఎస్పీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యుగంధర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నూతన నియామకం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా పైడికాల్వ నాగరాణి నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు ఉండకుంట శ్రీరాములు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చార్లెస్, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రమణ్య శర్మ, గౌసియా, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కేసీ పల్లె జట్టు


కేసీ పల్లె జట్టుకు ట్రోఫీని అందిస్తున్న నిర్వాహకులు

పెనగలూరు (ఓబులవారిపల్లె) : గత కొన్ని రోజులుగా ఉత్కంఠగా సాగిన తలమంచి గిరీష్ రెడ్డి ఛారిటబుల్ ట్రస్టు నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ ముగిసింది. మండల కేంద్రంలో జరిగిన టోర్నీ ఫైనల్‌లో పెనగలూరు మండలం కోడి చెన్నాయిగారిపల్లె జట్టు, కోడూరు జట్లు తలపడ్డాయి. ఆసక్తిగా సాగిన ఈ పోరులో కోడిచెన్నాయిగారిపల్లె జట్టు విజేతకు నిలిచి రూ.లక్ష నగదు బహుమతిని గెలుపొందింది. రన్నరప్‌కు రూ.50వేలు దక్కించుకుంది. ఈ సందర్భంగా నిర్వాహకుడు గిరీష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో క్రీడలను ప్రోత్సహించేందుకు టోర్నమెంట్ జిల్లాస్థాయిలో ఏర్పాటు చేశామన్నారు. అలాగే మండలస్థాయిలో వాలీబాల్ పోటీలను కూడా నిర్వహించామన్నారు. విజేతగా నిలిచిన పెనగలూరు జట్టుకు రూ.20వేలు, రన్నరప్‌గా నిలిచిన నారాయణ నెల్లూరు జట్టుకు రూ.10వేలు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లాస్–1 కాంట్రాక్టర్‌లు తలమంచి చంద్రభాను రెడ్డి, తలమంచి ధనుంజయరెడ్డి, దువ్వూరు రాఘవరెడ్డిలతోపాటు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను చూపుతున్న ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రామలింగారెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ ఉద్యోగుల అవసరార్థం రూపొందించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రామలింగారెడ్డి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఓ.బ్రహ్మానందరెడ్డిలు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని డివిజనల్ ఇంజనీర్ వారి కార్యాలయం ప్రాంగణంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న కడప నగరంలోని జిల్లా పరిషత్‌లో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం ఉద్యోగులు, కార్మికులకు చట్టాలపైన, విద్యుత్ యాజమాన్యాలు రూపొందిస్తున్న ఆర్డర్ల పైన, హక్కుల పైన అవగాహన కోసం డైరీ రూపొందిస్తున్నామని తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకంతో ఆదాయం

ఓబులవారిపల్లె : పుట్టగొడుగులు పెంపకం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆచార్యులు డాక్టర్ సీహెచ్ రూత్ పేర్కొన్నారు. బుధవారం వైకోట గ్రామంలో ఐసీఏఆర్ఎస్సీ సబ్ ప్లాన్ కింద ప్రాజెక్టులో భాగంగా వైకోట గ్రామంలో పుట్టగొడుగుల పెంపకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో పుట్టగొడుగుల యూనిట్లను ప్రారంభించేలా మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఆచార్యులు సీహెచ్ రూత్ మాట్లాడుతూ పుట్టగొడుగుల్లో మంచి పోషకాలు ఉంటాయని, పుట్టగొడుగుల పకోడిలు, పుట్టగొడుగులు సూప్, పుట్టగొడుగుల ద్వారా పచ్చడి తయారు చేసుకోవచ్చని, వాటిలోని పోషకాలు ఎంతో విలువైనటువంటివని ఆమె అన్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ ఉద్యాన కళాశాల ఆచార్యులు స్వరాజ్యలక్ష్మి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


బహుమతులు అందజేస్తున్న శ్రీజా డైయిరీ చైర్‌పర్సన్ శ్రీదేవి

కలికిరి : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బుధవారం ప్రజలు ఘనంగా సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. కలికిరి పట్టణ పరిధిలోని క్రాస్ రోడ్డు అంకాళమ్మ ఆలయం వద్ద ఆలయ నిర్వాహకులు, సంక్రాంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, ఉత్తమ ప్రతిభ చాటిన మహిళలకు ప్రోత్సాహక బహుమతులు అందచేశారు.

కన్నుల పండువగా కనుమ

మదనపల్లె సిటీ : మదనపల్లె మండలంలో కనుమ పండుగ కన్నుల పండువగా జరిగింది. మదనపల్లె మండలం బసినికొండ, పోతబోలు, మాలేపాడు, సిద్దమ్మగారిపల్లె, గోవర్ధనగిరి, గొల్లపల్లి, నీరుగట్టువారిపల్లె ప్రాంతాల్లో కనుమ పండుగ ఘనంగా నిర్వహించారు. పశువులను రంగు రంగు బెలూన్లు, పూలతో అలంకరించారు. మహిళలు గోవులకు పసుపు,కుంకుమ పెట్టి పూజలు చేశారు.

కలకడ : సాంప్రదాయ బద్ధంగా, సంక్రాంతి సంబరాలను రైతులు ఆనందంతో జరుపుకున్నారు. బుధవారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కొత్తగాండ్లపల్లె, కోన,కదిరాయచెర్వు, బాలయ్యగారిపల్లె, యర్రయ్యగారిపల్లె తదితర గ్రామాలలో సాంప్రదాయబద్ధంగా పశువులను అలంకరించి, ఊరేగింపుగా చిట్లా కుప్పవద్దకు తరలించి డప్పువాయిద్యాలతో పశువులను బెదిరించి అగ్గిమండుతున్న చిట్లాకుప్ప చుట్టూ మూడు ప్రదక్షణలు చేయించారు.

మహిళలకు ముగ్గులపోటీలు

తంబళ్లపల్లె : శ్రీజా డైయిరీ ఆధ్వర్యంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ సహకారంతో బుధవారం తూర్పుదళితవాడలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. మిల్క్‌ప్రొడ్యూసింగ్ మహిళలకు ముగ్గుల పోటీలు, చిన్నారులకు ఆటల పోటీలు, రైతులకు పశువుల అలంకరణలపై పోటీలు నిర్వహించారు. విజేతలకు మహిళామిల్క్ ప్రొడ్యూసింగ్ కంపెనీ చైర్మన్ శ్రీదేవి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ లింగారావ్, డైరీ ఏరియా మేనేజర్ మునికృష్ణ, పశువుల డాక్టర్ విష్ణు ప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్లుపాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం


షటిల్ టోర్నమెంట్ విజేతలతో నిర్వాహకులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన షటిల్ టోర్నమెంట్‌లో విజేతలకు నిర్వాహకులు బహుమతులను ప్రదానం చేశారు. బుధవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో షటిల్ టోర్నమెంట్ నిర్వహించారు. శోభనాల రమేష్ టీమ్ విజేతగా, ముదస్సర్ టీమ్ రన్నరప్‌గా నిలిచాయి. విజేతలకు రెడ్డెమ్మకొండ కమిటి డైరెక్టర్ నక్కామధు నగదు బహుమతి రూ.5 వేలు అందజేశారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్, మార్కెట్‌కమిటి డైరెక్టర్ గణేష్, నిర్వాహకులు శిరిడి, తరుణ్,శివ, సలీమ్,శీను బాలాజిలు పాల్గొన్నారు.

22న ఫ్యాన్సీ డ్రెస్, ముగ్గుల పోటీలు

మదనపల్లె సిటీ : అయోధ్యలో శ్రీ బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో స్త్రీలకు ముగ్గుల పోటీలు, చిన్న పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ఆవరణలో మధ్యాహ్నం 3.30 గంటలకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. చిన్న పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు (రామ,సీత,లక్ష్మణ, హనుమాన్ వేషధారణలకు మాత్రమే అనుమతి) జరుగుతాయన్నారు. పాల్గొన్నవారందరికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వివరించారు.

తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగం రాయల పాలన

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి


శ్రీకృష్ణదేవరాయలు జయంతిలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి

రాజంపేట : శ్రీ కృష్ణదేవరాయలు పాలన తెలుగు సాహిత్యానికి స్వర్ణయుగమని జెడ్పీ చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి నేతృత్వంలో రాజంపేట పాత బస్టాండులోని శ్రీ కృష్ణదేవరాయలు విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకలలో స్థానిక మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ రాయల కాలంలో తెలుగుభాష పరిడవిల్లిందన్నారు. సమర్థుడైన పాలకుడిగా రాయలకు పేరుందన్నారు. మారుమూల పల్లెటూర్లకు సైతం రాయల పాలన ప్రయోజనాలు అందాయన్నారు. మున్సిపల్ చైర్మన్ పోలా మాట్లాడుతూ రాయలు విశిష్ట పాలకుడన్నారు. కళాభిమాని, కళా సాహిత్యపోషితునిగా రాయలు ఖ్యాతి నలుదిశలా వ్యాపించిందన్నారు. మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రి రవి మాట్లాడుతూ ఏపీ దక్షిణ ప్రాంతంలో ఐదు జిల్లాల్లో కూడిన ప్రాంతం ఆయన పేరుమీదనే రాయలసీమగా పేరొందిదన్నారు. రాయల విజయాలు సైనికచరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయమన్నారు. అటువంటి రాయలను జయంతి సందర్భంగా గుర్తుచేసుకోవడం భాగ్యమన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, కాపు నేతలు గునకల సుబ్బరాయుడు, అరిగె మణి, అరిగెల సౌమిత్రి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత మిరయాల సురేఖ, మైనార్టీ నేత ఆసిఫ్, నాయకులు డీలరు సుబ్బరామిరెడ్డి, పెంచలయ్య, సాంబెత్తిన శ్రీను, రోళ్లమడుగు సుబ్బరాజు, జ్యోతి, కౌన్సిలర్ తంబా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయల జయంతి సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి ఆధ్వర్యంలో పాతబస్టాండు సర్కిల్‌లో వందలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

ఘనంగా 'గొబ్బెమ్మ' ఊరేగింపు


గొబ్బెమ్మ ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దవటంలో గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపులో స్థానిక మహిళలు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొని గొబ్బెమ్మ పాటలను పాడారు. ఈ పండుగ రోజున ముగ్గులు వేసి ముగ్గులో గొబ్బెమ్మను పెట్టి పసుపు, కుంకుమతో అలంకరిస్తారన్నారు. ముగ్గులో పెట్టే గొబ్బెమ్మను గోదాదేవిగా పూజిస్తారన్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలు రెండూ లక్ష్మిదేవికి చాలా ఇష్టమైనవన్నారు. పండుగ రోజుల్లో ముగ్గ మధ్యలో గొబ్బెమ్మను పెడితే ఇంట్లోకి లక్ష్మీదేవిని ఆహ్వానించినట్లేనని మహిళల్లో విశ్వాసమున్నట్లు స్థానిక మహిళలు తెలిపారు.

ఉర్దూ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి


మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌కు సమస్యలు వివరిస్తున్న రూటా నేతలు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరింపజేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) నేతలు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానంలకు విన్నవించారు. బుధవారం వారు పై నేతలను వేర్వేరుగా వారి కార్యాలయాలలో కలుసుకుని తమ సమస్యలను తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఉర్దూ డైట్ కళాశాలలో అధ్యాపకులను వెంటనే నియమింపచేయాలన్నారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న గ్రామాలు, పట్టణాల్లో ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలంటూ కోరారు. 117 జీఓకు సంబంధం లేకుండా ఉర్దూ హైస్కూళ్లకు ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రతి ఉర్దూ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులు ఉండేలా చూడడం, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమింపచేయాలంటూ విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే, డిప్యూటీ చైర్‌పర్సన్‌లు సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపచేసేందుకు కృషి చేస్తామంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూటా మహమ్మద్ ఆయూబ్, మహమ్మద్ హషీం, జాఫరుద్దీన్, మహమ్మద్ అలీ, సబాతుర్ రహిమాన్, ముహిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతరలు

రామాపురం : మండలంలోని గోపగుడిపల్లె కస్బాలో బుధవారం గుండు గంగమ్మ, గౌరమ్మ తల్లుల జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. జాతరలో భాగంగా ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు తీర్చుకున్నారు. ప్రతి యేడు జాతరను కనుమ రోజున నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు పందోళ్లపల్లి బలరామయ్య తెలిపారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచేకాక ఇతర మండలాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అనంతరం విగ్రహాన్ని పురవీధులలో ఊరేగించారు.